వైఎస్సార్ సీపీ మద్దతుదారుల హవా



డిక్లరేషన్ తీసుకుంటున్న వేల్పుల నారాయణమ్మ



జోన్నలగడ్డ నాగమ్మ



దార్ల చెన్నమ్మ

మార్కాపురం: ఈనెల 19న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల పోరులో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలుపొందారు. మార్కాపురంలో మొత్తం నాలుగు స్థానాలకు గాను 3 స్థానాలు ఏకగ్రీవం కాగా ఒక చోట జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి గెలుపొందారు. పొదిలి మండలం కొండాయపాలెం పంచాయితీ 3వ వార్డులో జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేసిన జోన్నలగడ్డ నాగమ్మ తన సమీప టీడీపీ మద్దతుతో పోటీ చేసిన జె.రాధపై 11 ఓట్ల తేడాతో గెలుపొందింది. తర్లుపాడు మండలంలోని కేతగుడిపి పంచాయతీలో 1వ వార్డు అభ్యర్థిగా నామినేషన్ వేసిన వేల్పుల నారాయణమ్మ, మంగళకుంట పంచాయతీలోని 3వ వార్డు సభ్యురాలుగా వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేసిన గుమ్మ పిచ్చమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొనకనమిట్ల మండలంలోని పెదారికట్ల ఎస్సీ 1వ వార్డుకు దార్ల చెన్నమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



గుమ్మ పిచ్చమ్మ

ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్ సీపీనే: ఎమ్మెల్యే కేపీ

ఎన్నికలు ఎవైనా, ఎప్పుడు జరిగినా వైఎస్సార్ సీపీ అభ్యర్థులు కచ్చితంగా ఘన విజయం సాధిస్తారన టంలో ఎలాంటి సందేహం లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారు.

యర్రగొండపాలెం నియోజకవర్గంలో..

యర్రగొండపాలెం: పెద్దారవీడు మండలంలోని కలనూతల పంచాయతీలోని 6వ వార్డు సభ్యుడు బత్తుల కాశయ్య మృతి చెందాడు. అతని కుమారుడు శ్రీనివాసులు వైఎస్సార్ సీపీ మద్దతుతో వార్డు సభ్యుడిగా నామినేషన్ దాఖలుచేశాడు. వైఎస్సార్ మద్దతు అభ్యర్థి 68 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. ఆ మండలంలోని గొబ్బూరు పంచాయతీలోని 3 వార్డు, 9 వార్డుల్లో మృతుల భార్యలు నాగేంద్రమ్మ, నాగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



అంగిరేకుల నాగమ్మ



బత్తుల శ్రీనివాసులు



దొండపాటి నాగమ్మ

దర్శి నియోజకవర్గంలో..

దర్శి: ముండ్లమూరు మండలం చింతల పూడి 10వ వార్డులో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు దారు పోసి పోగు మౌనిక స్వతంత్ర్య అభ్యర్థిపై 61 ఓట్లు, టీడీపీ మద్దతు దారుపై 83 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. మొత్తం 231 ఓట్లు పోలవ్వగా టీడీపీ మద్దతుదారుకు 39 ఓట్లు మాత్రమే వచ్చాయి.



చింతపూడి మౌనిక

గిద్దలూరు నియోజకవర్గంలో..

గిద్దలూరు: మండలంలో నరవ గ్రామ పంచాయతీలోని ఎస్.బయనపల్లె 10 వ వార్డు అభ్యర్థి ఈదుల భూలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమెను వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామ సర్పంచి బండి శ్రీనివాసులు బలపరచారు.



ఈదుల భూలక్ష్మి

కంభంలో..



ఖైరం కొండ సుజాత



పియం పుష్పకళ

కంభం: ఔరంగబాదు పంచాయతీ పరిధిలోని 8వ వార్డులో ఖైరం కొండ సుజాత ఏకగ్రీవం, పెద్దనల్లకాల్వ పంచాయతీ పరిధిలోని 5 వార్డులో బి.యం. పుష్పకళ ఏకగ్రీవంగా గెలిచారు.



మేఘావత్ జయప్రద

అర్ధవీడు మండలంలో..

పాపినేపల్లి పంచాయతీ పరిధిలో 9వ వార్డులో మేఘావత్ జయప్రద ఏకగ్రీవం అయ్యారు.

కొమరోలు మండలంలో..

కొమరోలు : కొమరోలు గ్రామపంచాయతీ పరిధిలో 15వ వార్డులో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థి చల్లగొలుసుల శారద నామినేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి స్వగ్రామమైన కొమరోలులోనే టీడీపీ నుంచి అభ్యర్థి లేకపోవడం విశేషమని ప్రజలు చర్చించుకుంటున్నారు.



చల్లగొలుసుల శారద

బేస్తవారిపేట మండలంలో



బాలస్వామి



రహీం

బేస్తవారిపేట: ఖాజీపురంలో వైఎస్సార్ సీపీ బలపరిచిన వినుకొండ బాలస్వామి 89 ఓట్ల మెజీర్టీతో గెలుపొందాడు. అక్కపల్లెలో రహీంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చెట్టిచర్లలో ఆదిలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఆదిలక్ష్మి

రాచర్ల మండలంలో



గంగారపు శారదమ్మ



షేక్.నూర్జహాన్

రాచర్ల: మండలోని యడవల్లి పంచాయతీ 7వ వార్డును గంగారపు శారదమ్మ ఏకగ్రీవమయ్యారు. గుడిమెట్ట 2వ వార్డులో షేక్ నూర్జహాన్ కూడా ఏకగ్రీవంగా గెలిచారు. రాచర్ల 6వ వార్డులో షేక్ హాజరాబి 114 ఓట్లతో గెలుపొందారు.



షేక్.హాజరాబి

క్లుప్తంగా

దోమల వ్యాధులపై అవగాహన

పెద్దదోర్నాల: ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో కార్యక్రమాలను నిర్వహించారు. చింతల డాక్టర్ ఎం.యాగ్నిక్ వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించారు. డివిజన్ సబ్ యూనిట్ ఆఫీసర్ రమేష్, మలేరియా సూపర్‌వైజర్ ఇజ్రాయిల్, బీసీ హాస్టల్ వార్డెన్ కె.లక్ష్మీనాయక్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ డి.లక్ష్మీనాయక్, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ టీచర్ తులసి నాయక్, ఏఎన్ఎం కే.నాగలక్ష్మీ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

500 మంది పేదలకు ఆహారం అందజేత

మార్కాపురం టౌన్: యువ కేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేకరించిన ఆహారాన్ని పట్టణంలోని కొండారెడ్డి కాలనీ, ఎస్ఎస్ నగర్‌లో ఉంటున్న సుమారు 500 మంది పేదలకు అందజేసినట్లు సంస్థ అధ్యక్షుడు ఆరీఫుద్దీన్ తెలిపారు. మార్కాపురం, గిద్దలూరు, బేస్తవారిపేట ప్రాంతాల్లో శుభకార్యాల్లో మిగిలిన ఆహారాన్ని తాము సేకరించి పేదలకు అందించామన్నారు. ఎక్కడైనా ఆహారం మిగిలితే వృథా చేయకుండా 7386642536కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

అంకాళమ్మకు ప్రత్యేక పూజలు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో గ్రామ ప్రజల ఇలవేల్పు అయిన అంకాళమ్మకు ఆదివారం గ్రామస్తులు పూజలు చేశారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మార్కాపురం టౌన్: మార్కాపురం ప్రాంత ప్రజల గ్రామదేవత అల్లూరి పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం కావటంతో పట్టణ ప్రజలతో పాటు వేములకోట, సీతనాగులవరం, రామచంద్రపురం తదితర గ్రామాల నుంచి భక్తులు కుంకుమ బండ్లు కట్టుకుని వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. నాగమయ్య శిలలకు, నాగమయ్య పుట్టకు పాలు పోసి పూజలు చేశారు. ఈవో చెన్నకేశవరెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్లు కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

గుంటిగంగా భవానికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుంటి గంగాభవాని అమ్మవారికి భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు 10 చీరెలు సమర్పించారు. ఆలయానికి 6905 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆర్‌పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈఓ ఏబీ భాస్కరరెడ్డి, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావులు ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేక అలంకరణలో గంగాభవాని అమ్మవారు

ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

కురిచేడు: మండలంలోని కాటంవారిపల్లెలో వేంచేసి ఉన్న శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు అమ్మవారికి పొంగళ్ల నైవేద్యం తయారు చేసి, చిన్నప్రభను నిర్మించి గ్రామోత్సవం చేశారు. అనంతరం అమ్మవారికి పొంగళ్లు సమర్పించి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడికి సన్మానం

ముండ్లమూరు: మండలంలోని పులిపాడు ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న షేక్ మస్తాన్‌వలి బదిలీపై వె వెళ్లడంతో కాలనీ వాసులు ఆదివారం ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్, ఏఎంసీ డైరెక్టర్ దాసరి ఏలియ్య మాట్లాడుతూ మస్తాన్‌వలి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశారన్నారు. హెచ్ఎం లేవి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించాలి

- మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

మార్కాపురం: భవన నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న ఆర్ఆర్ అంబరం విల్లాస్, ప్లాట్స్ నిర్మాణానికి ఆదివారం మంత్రి సురేష్ మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా వెంకట రాంబాబు, జిల్లా వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, సోదరుడు డాక్టర్ ఆదిమూలపు సతీష్‌తో కలిసి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషీర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్ పి.కేశవరావు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మాధవరావు, యర్రగొండపాలెం మార్కెట్ యార్డు చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, త్రిపురాంతకం ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, పుల్లలచెరువు, పెద్దారవీడు, దోర్నాల మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సురేష్, డాక్టర్ సతీష్

ఎన్నికలు ఏవైనా వైఎస్సార్ సీపీదే విజయం

గిద్దలూరు రూరల్: ఎన్నికలు ఏవైనా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే ప్రజలు విజయం చేకూరుస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులను ప్రజలు చిత్తుగా ఓడించారన్నారు. జగనన్న సంక్షేమ పాలనకు మద్దతుగా ప్రజలు మద్దతు తెలియజేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 66 సర్పంచ్ ఎన్నికలకు గాను 64 గ్రామాలకు ఎన్నికలు జరిగాయని అందులో 30 సర్పంచ్ పదవులు ఏకగ్రీవమై, మిగిలిన 34 చోట్ల జరిగిన ఎన్నికల్లో 23 చోట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున అభ్యర్థులు ఘన విజయం సాధించారన్నారు. మిగిలిన 10 స్థానాల్లో టీడీపీ మద్దతుదారులు, ఒక స్థానంలో జనసేన మద్దతుదారులు గెలిచారన్నారు. అదేవిధంగా మొత్తం 1062 వార్డుల్లో, 63 స్థానాల్లో ఎన్నికలు జరగకపోగా.. జరిగిన 243 వార్డుల్లో 149 వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, 90 టీడీపీ, 4 జనసేన మద్దతుదారులు విజయం సాధించారని చెప్పారు. ఏకగ్రీవాలతో కలిపి 810 చోట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు, 182 వార్డుల్లో టీడీపీ మద్దతుదారులు, 7 వార్డుల్లో జనసేన పార్టీ మద్దతుదారులు విజయం సాధించారని చెప్పారు. గిద్దలూరు నియోజకవర్గంలో మొత్తం ఒక సర్పంచ్, 15 వార్డు స్థానాలకు గాను 13 ఏకగ్రీవం కాగా అందులో 9 స్థానాల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఏకగ్రీవం కాగా బేస్తవారిపేట, రాచర్ల మండలాలకు గాను రెండు స్థానాల్లో ఎన్నికలు జరిగి వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయం సాధించారని తెలిపారు.



అన్నా రాంబాబు

యూటీఎఫ్‌ను బలోపేతం చేయాలి

దొనకొండ: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 1974లో ఆవిర్భవించి నేడు రాష్ట్రంలో సుమారు లక్ష మంది సభ్యులతో ఉపాధ్యాయ సంఘంలో అగ్రగామిగా ఉంటుందని, ఇంకా రాష్ట్రంలో యూటీఎఫ్ శాఖను బలోపేతం చేయడానికి కలిసి కట్టుగా పని చేద్దామని వక్తలు కొనియాడారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి టి.రాజశేఖర్ అధ్యక్షతన ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యా చైతన్య సదస్సు, జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర యూటీఎఫ్ గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, పశ్చిమ, తూర్పు గోదావరి ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, స్థానిక సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌కుమారి దేవానంద్, మండల విద్యాధికారులు ఎస్.సాంబశివరావు, షేక్ అమీర్, ఉపాధ్యాయులు, ఎస్టీఎఫ్ఐ, యూటీఎఫ్ జాతీయ జెండాకు వందనం చేసి ఎగురవేశారు. ఇటీవల మరణించిన ఉపాధ్యాయురాలు జె.శిరీషకు నివాళులర్పించారు. ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాను దొనకొండకు చాలా సార్లు వచ్చానని, ఇక్కడ యూటీఎఫ్ శాఖ చాలా బలంగా ఉందన్నారు. విప్లవకారుడు గద్దర్ పాటలను పాడారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

భోజనాల ఏర్పాటు

సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి సహకారంతో గంగదేవిపల్లి మాజీ సర్పంచ్ కర్నాటి ప్రసన్నాంజనేయరెడ్డి భోజనాలు ఏర్పాటు చేశారు. యూటీఎఫ్ అధ్యక్షులు యం. వెంకటరెడ్డి, గౌరవ అధ్యక్షులు కటారి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఈర్ల రోశయ్య, సంఘ నాయకులు, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌కుమారి దేవానంద్, ఎంఈఓలు ఎస్.సాంబశివరావు, షేక్. అమీర్, ప్రధానోపాధ్యాయులు వీవీ రామాంజనేయులు, మాజీ ఎంపీపీ ఎస్.శివకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

496 మందికి వైద్య పరీక్షలు

కొమరోలు: మండలంలోని తాటిచెర్లలో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి ప్రజావైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గిద్దలూరుకు చెందిన డాక్టర్ బ్రహ్మానందరెడ్డి ప్రజావైద్యశాల వైద్యులు, వైద్యసిబ్బంది ఈ శిబిరంలో పాల్గొని పరీక్షలు నిర్వహించారు. 496 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. కంటి ఆపరేషన్లు 76 మందికి, ఈఎన్‌టీ ఆపరేషన్లు 9 మందికి, జనరల్ సర్జరీలు 15 మందికి ఉచితంగా చేయిస్తున్నట్లుగా తెలిపారు.

వైభవంగా చెన్న మల్లేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి కుటుంబ సభ్యులు

ముండ్లమూరు: మండలంలోని జమ్మలమడకలో నూతనంగా నిర్మించిన చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. బూచేపల్లి సుబ్బారెడ్డి - వెంకాయమ్మ చారిటబుల్ ట్రస్ట్, బూచేపల్లి శివప్రసాదరెడ్డి ధర్మపత్ని నందిని ఆధ్వర్యంలో అన్న ప్రాస వితరణ కార్యక్రమం జరిగింది.



స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు

అలరించిన సంగీత విభావరి

మార్కాపురం: పట్టణంలోని రీడింగ్ రూం ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రముఖ గాయకులతో ఏర్పాటు చేసిన సంగీత విభావరి శ్రోతలను అలరించింది. ప్రముఖ న్యాయవాదులు, గాయకులు పురాణం సుబ్రమణ్యం, ఝాన్సీరాణి ఆధ్వర్యంలో గాయకులు రాజకుమారి, చిన్ని, కరుణ, ఏడుకొండలు, గోపాలరావు, రమేష్, వెంకటేశ్వర్లు, తదితరులు రాగయుక్తంగా పాడారు.

యాదవ ఉద్యోగులకు సన్మానం

గిద్దలూరు రూరల్: ఈ ఏడాది ఆగస్టు 15న స్వాతంత్ర్యపు దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులను పొందిన వీఆర్‌ఓ వై.పి.రంగయ్య, ప్రిన్సిపాల్ నంద్యాల శ్రీనివాసులు, హార్టికల్చరల్ ఉద్యోగి మోహనక్రిష్ణలను పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం యాదవ ఎంప్లాయీస్ అసోసియేషన్ వారు సన్మానించారు. వారి సేవలను పలువురు యాదవ సంఘం నాయకులు మొర్రిపిచ్చయ్య యాదవ్, ఓ.వెంకటయ్యలతో పాటుగా పలువురు వారిని కొనియాడారు.

స్నేహం.. అ'పూర్వ'ం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95లో పదో తరగతి చదివిన 32 మంది స్నేహితులు ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని కుటుంబాల యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. చదువు చెప్పిన గురువులు దోర్నాల వరమ్మ, బరిగె నరసింహారావు, కేఎస్ఆర్, లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి చొరవ చూపిన వై.మాల్యాద్రి, వి.రాంబాబు, సీహెచ్ అర్జున్, ఎం.శ్రీనివాసరావు తదితరులను స్నేహితులంతా అభినందించారు.

ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం

పెద్దదోర్నాల: మండల పరిధిలోని నల్లమల అభయారణ్యం బోడేనాయక్ తండాలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి పనులను హైదరాబాద్‌కు చెందిన ప్రస్థాన సాఫ్ట్‌వేర్ కంపెనీ డైరెక్టర్ మద్దెల లక్ష్మీసతీష్ ఆదివారం చేపట్టారు. ఆదివారం ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి 4 లక్షల రూపాయలతో ఆలయ గోపురం పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఇనుపకోళ్ల కిరణ్‌కుమార్, రఘుపతి సతీష్ నాయుడు, షేక్ అబ్దుల్ మజీద్, జెడ్పీటీసీ సభ్యురాలు దుమావత్ లతా చంద్రకాంత్, చంద్రకాంత్ నాయక్, ఒంటేరు నాగేశ్వరరావు, దూదేకుల రసూల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు అభినందనలు



సబ్ కలెక్టర్ సేథు మాధవన్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

మార్కాపురం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంస పత్రం పొందిన సబ్ కలెక్టర్ సేథు మాధవన్‌ను డివిజన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. సబ్ కలెక్టర్‌ను సన్మానించిన వారిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సిద్దంశెట్టి చంద్రశేఖరరావు, అనిల్, గంగిరెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలే గెలుపునకు నాంది



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి

పెద్దారవీడు:సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ బలపరిచిన వార్డు అభ్యర్థుల గెలుపునకు దోహదపడిందని పార్టీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. దేవరాజుగట్టు గ్రామంలో ఆదివారం మాట్లాడుతూ గొబ్బూరు పంచాయతీలో 3వ వార్డు దొండపాటి నాగమ్మ, 9వ వార్డు అంగిరేకుల నాగేంద్రమ్మలను ఏకగ్రీవం, కలనూతల పంచాయతీ 6వ వార్డు మెంబరు బత్తుల శ్రీనివాసులు 68 ఓట్ల మేజర్టీతో గెలిచారన్నారు. సాయంత్రం నాయకులతో పాటు గెలిచిన వార్డు మెంబర్లు మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబులను తమ నివాసంలో కలిసి శాలువ, పూలమాలలతో సత్కరించారు. కలనూతల, గొబ్బూరు సర్పంచులు కొర్ర భూలక్ష్మీ రానాయక్, అంగిరేకుల ఆదినారాయణ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

గిద్దలూరు రూరల్: నాగులచవితి సందర్భంగా పట్టణంలోని రాజానగర్, నల్లబండ బజారులోని పుట్టల వద్ద భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పాలు పోసి పూజలు నిర్వహించారు. రేడియాబావి వద్ద గల నాగమయ్య ఆలయంలోని నాగుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.